

రంజాన్ వేళలు
ఇఫ్తార్ | 6:30
గురువారం
సహర్ | 4:51
శుక్రవారం

టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

నెన్నెల, మార్చి 27: పెంచిన టెట్ పరీక్ష ఫీజులను వెంటనే తగ్గించాలని జిల్లా ఛాత్రోపాధ్యాయ సంఘం సభ్యుడు రాంటెంకి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో రూ. 200ల నుంచి రూ. 400ల వరకే ఉన్న ఫీజును ఏకంగా వెయ్యి రూపాయలకు పెంచడం సరికాదని తెలిపారు. పేదలకు భారం పడకుండా ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 27: వేసవికాలం అయినందున జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ బగీరథ పైపులైన్ల లీకేజీని గుర్తించి ఐదు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. నీటి సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వారికి ముందుగా సమాచారం అందించి నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ తదితరులుపాల్గొన్నారు.

● మొక్కలను సిద్ధం చేయాలి

జిల్లాలో నిర్ధేశిత లక్ష్యాలకు అనుగుణంగా నాటేందుకు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీల్లో సీడ్ జర్మినేషన్ అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అసవరం అయితే నూతన సీడ్ జర్మినేషన్ చేపట్టాలన్నారు. మొక్కలకు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచిచారు. నీటి సౌకర్యం, షెడ్ నెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. అటవీ బీట్ అధికారులు గామాల్లోని నర్సరీలను సందర్శించి మొక్కల ఎదుగుదల అంశాలను పంచాయతీ కార్యదర్శి వద్ద గల రిజిష్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, తదితరులు పాల్గొన్నారు.

● సిబ్బంది చర్యలు తీసుకోవాలి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంరక్షణలో భాగంగా పిల్లలు, గర్భిణులు పోషకాహార లోపాలను అధిగమించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ అధికారులు, సీడీపీవోలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, కిశోర బాలికల సంరక్షణకు కృషి చేస్తున్నామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు, ఎత్తు , కొలతలు చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్ఫోర్స్ పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

ఏసీసీ, మార్చి 27: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ పాఠశాల మొదటి వార్షికోత్స వం బుధవారం ఓ ఫంక్షన్‌హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి దేవి చిత్రప టానికి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు సామాజిక అవగాహన కలిగి ఉండాలని వివిధ అంశాల పట్ల విస్తృతంగా పట్టు సాధించాలన్నారు. చదువు, ర్యాంకుల ద్వారానే జీవితం లో రాణించలేరని, క్రీడలు, కళలు, సమాజంలోని వివిధ అంశాలపై కనీస అవగాహన ఉండాల న్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుంటూ కొత్త అంశాలను నేర్చుకోవాల న్నారు. పిల్లలకు ఏ రంగం ఇష్టమో తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్స హించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, కళా ప్రదర్శనలు ఆక ట్టుకున్నాయి. క్రార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

ఏసీసీ, మార్చి 27: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీనివాస టాకీస్ మెయిన్ రోడ్డులో షాపుల వద్దకు వెళ్లి లోక్‌సభ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌తో కలిసి అభ్యర్థించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, సిసో డియా, శ్రీదేవి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లాప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, సుదర్శన్ గౌడ్, రాచర్ల సంతోష్‌కుమార్, రజిని, సత్యనారాయణ, సంపత్, మహీధర్లగౌడ్, విజయ్‌సాయి, ప్రదీప్, శ్రీనివాస్, కళ్యాణి, శ్రీనివాస్, రాంచందర్, శంకర్, దీపారాణి, సుమలత, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించలేదని షాపుకు తాళం

ఏసీసీ, మార్చి 27: మంచిర్యాల పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్ ఆస్తి పన్ను రూ. 1.41 ల క్షలు చెల్లించనందున బుధవారం మున్సిపల్ సిబ్బంది షాపుకు తాళం వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సమాయత్తం



- యాసంగిలో తగ్గిన వరి సాగు
- లక్షా 75వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- 245 కేంద్రాల ప్రారంభానికి సన్నాహాలు
- మౌలిక సదుపాయాల కల్పనకు అధికారుల చర్యలు

మంచిర్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధ్యాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం అవుతోంది. జిల్లాలో ఇంకా పూర్తిస్థాయిలో వరి కోతలు కాకముందే కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. అక్కడక్కడ వరి కోతలు ప్రారంభం కాగా మరో 15 రోజుల్లో సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. గతేడాది కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో వర్షాలు పడి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. అయితే దానికి భిన్నంగా అధి కారులు ముంద స్తుగా చర్యలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

85 వేల హెక్టార్లలో వరి సాగు..

గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి యాసంగి సీజన్‌లో వరి సాగు జిల్లాలో కొంతమేర తగ్గింది. జిల్లాలో 85 వేల హెక్టార్లలో వరి పంట సాగయింది. గత సీజన్‌లో జిల్లాలో 2 లక్షల 28వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా, ఈ సీజన్‌లో లక్షా 75 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని భావిస్తున్నారు. కొంతమంది మిల్లరు నేరుగా ధాన్యం సేకరించే చేసే అవకాశం ఉండటంతో కొనుగోళ్ల లక్ష్యం కొంత మేర తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా వరి మద్దతు ధర గ్రేడ్-ఏ రకం రూ. 2203 ఉండగా, కామన్ వెరైటీ రూ. 2183గా ఉంది. రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ముందుగా సాగు చేసిన చోట వరి కోతలు ప్రారంభమయ్యాయి. పూర్తిస్థాయిలో కోతలు చేపట్టేందుకు మరికొద్ది రోజులు సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి.

ఇతర ప్రాంతాల నుంచి..

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలకు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి ధాన్యం తరలించకుండా పకడ్బందీ చర్యలు చేప ట్టనున్నారు. కేవలం జిల్లా రైతులు పండించిన దాన్యాన్నే కొనుగోలు కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖల సిబ్బంది సమన్వయంతో జిల్లాలోకి వచ్చే అంతరాష్ట్ర సరిహద్దుల వద్ద వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. చెక్ పోస్టుల వద్ద 24 గంటల పర్యవేక్షణ చేపట్టాలనే ఆదేశాలు జారీ అయ్యాయి.

ఐకేపీ ఆధ్వర్యంలో..

యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో 245 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. గత సీజన్‌లో డీఆర్‌డీఏ (ఐకేపీ) ఆధ్వర్యంలో మొత్తం 240 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే జిల్లా కో ఆపరేటివ్ సొసైటీ (పీఏసీఎస్) ఆధ్వర్యంలో 100, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 60 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సం వత్సరం 245 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఆయా కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో ధాన్యం కొనుగోళ్లు చేయనున్నారు. ఈ మేరకు సెంటర్ నిర్వాహకులకు అవసరమైన శిక్షణ పూర్తి చేశారు. అలాగే లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు కోసం మొత్తం 57 లక్షల గన్నీ సంచులు అవసరం కాగా 20వేల వరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. మిగతా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచేందు కు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కోసం మౌలిక సదుపా యాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అధికారులకు సూచనలు..



మోతీలాల్, అదనపు కలెక్టర్

యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఇదివరకే సంబంధిత అధికారులకు సూచనలు చేశాం. ఏప్రిల్ రెండో వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నాం. కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించాం. రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని ఎండబెట్టుకొని, చెత్తచెదారం లేకుండా చేసి, కేంద్రానికి తీసుకు రావాలి.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

● కౌన్సెలింగ్ చేసిన రామగుండం సీపీ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

ఏసీసీ, మార్చి 27: రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని రామ గుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం రౌడీషీటర్లకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన మాట్లాడారు. రౌడీషీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, రౌడీషీ టర్లలో మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్ ఎత్తివేస్తామన్నారు. రౌడీషీటర్లతో మాట్లాడి నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, ఉద్యోగ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నేర వృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో జీవించాలన్నారు. తొందరపాటులో చేసిన నేరాలకు వారి కు టుంబీకులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నా రు. సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు జరుపుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో నేరస్తులు ఎవరు చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. భూక బ్జాలు, ప్రజలను భయపెట్టడం వంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. పదేళ్లుగా ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో ఉన్న వారి రౌడీషీట్‌ను తొలగించేందుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ అశోక్‌కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరేష్‌కుమార్, ఎస్సైలు, పాల్గొన్నారు.

ఒకరికి రిమాండ్

ఏసీసీ, మార్చి 27: యాక్సిడెంట్ కేసులో కోర్టుకు హాజరు కాకుండా తిరుగుతున్న ఒకరిని బుధవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మంచిర్యాల పట్టణంలోని ఏసీసీకి చెందిన ముప్పాళ్ల సమ్మయ్య అలియాస్ సంతోష్ 2017 నుంచి యాక్సిడెంట్ కేసులో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. మంచిర్యాల జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ముద్దాయి సమ్మయ్యపై గతంలోనే అరెస్టు వారెంట్ జారీ చేయగా బుధవారం నిందితుడు సమ్మయ్య పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం రిమాండ్ నిమిత్తం లక్షెట్టిపేట సబ్ జైలుకు తరలించారు. యాక్సిడెంట్ కేసు విచారణకు హాజరు కాకుండా తప్పించుకుని తిరగడమే కాకుండా దొంగతనాలకు కూడా పాల్పడుతున్నట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు.

గుడుంబా తరలిస్తున్న ఒకరిపై కేసు

శ్రీరాంపూర్, మార్చి 27: గుడుంబా తరలిస్తూ పట్టుబడిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు దండేపల్లి ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా దండేపల్లి గ్రామ శివారులో బుధవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన జర్పుల గణేశ్ తన స్కూటీపై వస్తూ కనిపించాడు. పోలీసులు అతడిని నిలిపి వాహనం తనిఖీ చేయగా ఐదు లీటర్ల గుడుంబా(నాటుసారా) లభించింది. గుడుంబాను స్వాధీనం చేసుకొని గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది ఆనంద్, సునీల్, తిరుపతి, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

'మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి'

జన్నారం, మార్చి 27: మండల కేంద్రానికిచెందిన తోకల రాకేష్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌కు మున్నూరు కాపు ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు బొడ్డు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాకేష్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో పోలీసుల కవాతు

చెన్నూరు, మార్చి 27: లోక్ సభ ఎన్నికల దృష్ట్యా బుధవారం సాయంత్రం చెన్నూరు పట్టణ పుర వీధుల గుండా పోలీసులు కవాతు నిర్వహించారు. ఓటు ఎంతో విలువైందని, అర్హులైన వారందరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ కవాతు నిర్వహించారు. చెన్నూరు కొత్త బస్టాండ్ నఉంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్, పెద్ద చెరువు, కూరగాయల మార్కెట్ మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు, పట్టణ సీఐ రవీందర్, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీస్ వైరు చోరీ

జన్నారం, మార్చి 27 :మండలంలోని కలమడుగు గ్రామానికిచెందిన గోదావరి పరివాహక ప్రాంతంలోని రైతులు బొంతల మల్లేష్, జక్కుల గౌరయ్య, గడ్డి విష్ణు, మేకల మల్లేష్, లక్ష్మి, నరేష్ , గంగ రాజన్న, రామ్మోహన్‌రావులకు చెందిన సర్వీసు వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం చోరీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

మావోయిస్టుల కట్టడికి పకడ్బందీ చర్యలు

కోల్‌సిటీ, మార్చి 27: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టుల కట్టడికి పకడ్బందీ చర్యలు చేపట్టామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామన్నారు. మావోయిస్టు ప్రభావిత పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక నిఘా పెట్టామని, ఇన్‌ఫార్మర్ల వ్యవస్థను పటిష్టపర్చామన్నారు. ప్రాణహిత సరిహద్దు ఫెర్రీపాయింట్‌లలో తాను పర్యటించానని, మావోయిస్టులకు సహకరించవద్దంటూ జాలర్లకు సూచించమన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో గడ్చిరోలి సరిహద్దు ఉందని, ఈ జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలు ఉన్నా యన్నారు. మహారాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులతో ఎన్‌టీపీసీ, గడ్చిరోలిలో సమావేశాలు జరిగాయని, ఈ సమావేశాల్లో సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నామని చెప్పారు. సమాచార మార్పిడితో ఆ ప్రాంతంలో ఎన్‌కౌంటర్లు కూడా జరుగుతున్నట్టు సీపీ తెలిపారు. మన ప్రాంతానికి రెండు దళాలు మహారాష్ట్రలో స్తబ్దంగా ఉండి పోయాయన్నారు. అయినా కూడా సమస్యాత్మక పోలీస్ స్టేషన్లు, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. రామన్‌పల్లి వద్ద అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టు, 21అంతర్ జిల్లాల సరిహద్దుల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. కమిషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రెండు కంపెనీల కేంద్ర బలగాలను తెప్పించామని, పెద్దపల్లికి సీఆర్‌పీఎఫ్, మంచిర్యాలకు సీఏపీఎఫ్‌ను కేటాయించామన్నారు. సర్వేలైన్స్ స్టాటికల్ టీమ్స్‌తో సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ

హాజీపూర్, మార్చి 27: మండలంలోని దొనబండ గ్రామంలో చెరువు పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలకు బుధవారం ఎంపీడీవో మధుసూదన్ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు త్వరగా పనులు ముగించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీని, పల్లె దవాఖానా, శ్మశాన వాటికలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఉదయ్, టెక్నికల్ అసిస్టెంట్ స్రవంతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- సింగరేణి డైరెక్టర్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

జైపూర్, మార్చి 27: మండలంలోని రామారావుపేట గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఐకే ఓసీపీ వద్ద సింగరేణి డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ నాయకులు నామాల తిరుపతి, ముదాం రమేశ్ వినతి పత్రం అందించారు. రామారావుపేట ప్రజలు ఓసీపీ నుంచి వచ్చే కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రత్యామ్నాయంగా పలు సౌకర్యాలు కల్పించాలన్నారు. రామారావుపేట నుంచి ఇందారం వరకు రోడ్డుపై లైట్లు, ఇందారం ఓవర్ బ్రిడ్జి నుంచి రామారావుపేట, ఎస్‌ఆర్‌పీ చెక్‌పోస్టు బీటీ రోడ్డు వేయాలని, రామారావు పేట గ్రామానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఓసీపీ పీవో శ్రీనివాస్‌కు కూడా సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

మాజీ ఎమ్మెల్యే కృషి వల్లే నియోజకవర్గానికి నిధులు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఏసీసీ, మార్చి 27: బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు చేసిన కృషి వల్లనే మంచిర్యాల నియోజకవర్గానికి నిధులు వచ్చాయని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. మంచిర్యాలకు మెడికల్ కళాశాల మంజూరు చేసిన ఘనత దివాకర్‌రావుకే దక్కుతుందన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి, గోదావరి నదిపై వంతెన, ఎల్లంపల్లి ప్రాజెక్టు వంటి పనులు సాధించి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచారన్నారు. ఐబీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి ఇప్పటికే రూ. 3 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. దాన్ని అర్థాం తరంగా కూలగొడతామని అనడం సరైంది కాదన్నారు. మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రస్తుతం మెడికల్ కళాశాల ఉన్న స్థలంలో నిర్మించడం అనువుగా ఉంటుందన్నారు. గోదావరిపై వంతెనను మంచిర్యాల వద్ద నిర్మిస్తే రూ. 160 కోట్లతో పూర్తవుతుందని, ముల్కల్ల, వేంపల్లి మధ్య నిర్మిస్తే పెట్టుబడి పెరగడంతో పాటు దూరం కూడా 20 కిలోమీటర్ల పెరుగుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు అంకం నరేష్, గాదె సత్యం, సందెల వెంకటేష్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మందమర్రిరూరల్, మార్చి 27: బ్రహ్మంగారి ఆలయంలో బుధవారం ప్రత్యేక హోమం, అభిషేకాలను నిర్వ హించారు. గురువారం లక్ష్మీనర్సింహా స్వామి కల్యాణాన్ని పురస్కరించుకుని పూజలను నిర్వహించారు.

జన్నారం: మండలంలోని రేండ్లగూడ గ్రామంలో సీతారామాలయం విగ్ర హ ప్రతిష్ఠాపనకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధ వారం గ్రామస్థులు వేద పండితులతో కలిసి అభిషేకం నిర్వహించారు. ర్యాలీ గా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పుస్తెమట్టెలు అందజేత

ఏసీసీ, మార్చి 27: పేదింటి ఆడపడుచు వివాహానికి మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పుస్తె మెట్టెలు అందజేశారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త లక్ష్మి వివాహానికి కానుకగా పుస్తె మెట్టెలు అందించి ఆశీర్వదించారు.

జగిత్యాలలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జగిత్యాల టౌన్, మార్చి 27: జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో బుధవారం ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ములుగు జిల్లా నూజివీడు గ్రామానికి చెందిన మణికుమార్ సతీమణి జగిత్యాలలోని చిల్డ్రన్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తోంది. కొన్ని రోజులుగా వారికి కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. బుధవారం జగిత్యాలకు చేరుకున్న మణికుమార్ తన భార్యతో గొడవకు దిగాడు. తీవ్ర మనస్తాపానికి గురైన మణికుమార్ చేతిలో పురుగుల మందు డబ్బాను పట్టుకుని స్థానిక గొల్లపల్లి రోడ్‌లో కుటుంబ కలహాలతో ఆత్మ హత్యకు పాల్పడుతున్నానని పేర్కొంటూ డయల్ 100కు సమాచారం అందించాడు. తక్షణమే స్పందించిన బ్లూ కోల్ట్స్ పోలీస్ జుబేర్ సంఘటనా స్థలానికి చేరుకుని పురుగుల మందు డబ్బాను లాక్కుని రక్షించాడు. అనంతరం చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ములుగు జిల్లాలోని వాజేడు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వన్యప్రాణులకు నీటి కష్టాలు


అధికారులు ఏర్పాటు చేసిన సాసర్‌వెల్

» కడెం ప్రాజెక్టులో తగ్గిన నీటి మట్టం
» చెలిమెల ఏర్పాటుకు అధికారుల చర్యలు

జన్నారం, మార్చి 27: ఈ ఏడాది ఎండలు మార్చి నెలలోనే భగభగమంటున్నాయి. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో సాధారణ జనంతో పాటు మూగ జీవాలు సైతం వేసవి తాపానికి ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ప్రజలే ఎండకు సతమత మవుతుంటే వన్య ప్రాణుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. కవ్వాల టైగర్ జోన్‌కు ఎల్లప్పుడు నీటిని అందించే కడెం ప్రధాన కెనాల్ ఈ సంవత్సరం కడెం ప్రాజెక్టులో గేట్లు ఇబ్బంది పెట్టడం వల్ల ఉన్న నీరు అడుగంటి పోయింది. ఏకంగా ఆయకట్టు రైతులు క్రాప్ హాలీడే ప్రకటించారు. ఈ నేపథ్యంలో అడవి గుండా వెళ్లే కడెం ప్రధాన కెనాల్ నీరు లేక బోసిపోవడంతో నీటి లభ్యత కరువైంది. దీంతో అటవీ శాఖ అధికారులకు వన్య ప్రాణుల దాహార్తీ తీర్చడం తలనొప్పిగా మారింది.

● తగ్గిన నీటి లభ్యత..

ఈ ఏడాది ఉష్ణోగ్రతలు మార్చి నెలలోనే 40 డిగ్రీలు దాటి పోవడంతో అటవీ ప్రాంతంలో నీటి లభ్యత పూర్తిస్థాయిలో తగ్గడం మొదలైంది. దీంతో అటవీ శాఖ అధికారులు నీటి లభ్యత కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. కవ్వాల టైగర్ జోన్‌లో నీటి ఎద్దడితో ఓ పక్క ఇబ్బందులు పడుతుంటే మరో పక్క కార్చిచ్చు సమస్య వెంటాడుతూనే ఉంది. ప్రతి సంవత్సరం టైగర్ జోన్‌లో కార్చిచ్చు నివారణకు చర్యలు చేపడుతున్నారు. ఈ సంవత్సరం కూడా ప్రత్యేకంగా రహదారికి ఇరువైపులా ఎండుటాకులను ఏరివేసి అడవి లోకి కార్చిచ్చు రాకుండా చర్యలు చేపడుతున్నారు. అలాగే అడవిలోకి వెళ్లే వారు నిప్పును రగిల్చే వస్తువులను తీసుకువెళ్లకూడదని హెచ్చరికలు చేస్తున్నారు. శాటిలైట్ ద్వారా ఆయా బీట్‌లలో పర్యవేక్షణ చేపట్టామని అధికారులు చెబుతున్నారు. కృత్రిమా కార్చిచ్చు రగిలితే సంబంధిత బీట్ అధికారి మెసెజ్ వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.

● డివిజన్ పరిధిలో..

కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో అటవీ శాఖ అధికారులు వన్య ప్రాణులకు ఈ ఏడాది వేసవిలో దాహార్తీని తీర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రతియేడు అడవి గుండా కడెం ప్రధాన కెనాల్ నీటి మీద ఆధారపడి నీటి లభ్యత సమకూర్చుకునే వారు. కడెం కెనాల్‌కు మోటార్లు పెట్టి పరిసర ప్రాంతాల నీటి కుంటలు , చెక్ డ్యాంలు, ర్యాంపు వేలలో నీటిని నింపేవారు. ఈ సంవత్సరం నీటి లభ్యత లేకపోవడంతో కడెం కెనాల్ పూర్తిస్థాయిలో ఇప్పటికే అదికారులు ఉన్న నీటిని కాపాడుకునేందుకు టూ ఇన్‌టూ (స్క్వేర్ టూ కిలోమీటర్లు) పరిధిలో వన్య ప్రాణులకు నీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే కవ్వాల టైగర్ జోన్‌లో 16 సోలార్ కుంటలు ఉండడంతో ఈ సంవత్సరం మరో ఆరు నీటి కుంటలను ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా నీటి నిల్వ కోసం పొలాలు, పంపుల వద్ద ప్రత్యేక ర్యాంపు వేలు ఏర్పాటు చేసి వన్య ప్రాణులు దాహార్తీని తీర్చుకునేందుకు చర్యలు చేపట్టారు. ఉన్న సాసర్‌వెల్‌లలో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపేందుకు కృషి చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన నీటికుంటల వద్ద కొత్త బోర్‌వెల్స్ వేసి సోలార్ కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. దీంతో పాటు అడవి గుండా ఉండే వాగుల్లో ప్రత్యేకంగా చెలిమలు తవ్వి నీటిని ఊటల ద్వారా చేరే విధంగా ఇప్పటికే బేస్ క్యాంపు సిబ్బంది చర్యలు చేపట్టారు. వాగుల గుండా పలు ప్రాంతాల్లో చెలిమల ఏర్పాటు ప్రక్రియ మొదలైంది.


వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన నీటి కుంట

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..



వేసవిలో వన్య ప్రాణుల దాహార్తీని తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. చెలిమల ఏర్పాటు, సాసర్‌వెల్‌లలో నీటిని నింప డం, మరో 6 సోలార్ సాసర్ వెల్‌లలను ఏర్పాటు చేసిన నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- హఫీజుద్దీన్, ఇందన్‌పల్లి ఎఫ్‌ఆర్‌వో

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

బెల్లంపల్లి, మార్చి 27: ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో నేషనల్ హైవే, పోలీసు, రెవెన్యూ అధికారులతో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గత కొన్ని రోజులుగా కన్నాల జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నారని సంబంధిత అధికారులను ఇందుకు కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరుచూ ఒకే ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నేషనల్ హైవే , సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా కన్నా ల జాతీయ రహదారిపై , 68 డీప్ వద్ద నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో నేషనల్ హైవే , రెవెన్యూపోలీసు అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి

బెల్లంపల్లి, మార్చి 27 : బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల జాతీయ రహదారిపై యూటర్న్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు, గాయాపాలైన వారికి నష్టపరిహారం చెల్లించాలని బుధవారం దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు బెల్లంపల్లి ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షులు చిలుక రాజనర్సు, గోమాస రాజం, మురళీ, మధుసూదన్, మల్లేష్, రాజలింగు,నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

భీమిని, మార్చి 27: మండలంలోని మల్లీడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివపం చాయతన నవగ్రహ సహిత అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం కన్నుల పండుగగా నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ, దేవతా మూర్తుల ప్రతిష్ఠ, పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజుల పాటూ భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాలు తాండూరు మండలం అచ్చలాపూర్ వేద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుద్దిళ్ల మనోహర శర్మ వేద ప్రతిష్ఠ క్రతువును నిర్వహించారు.

నేడు 5కే రన్

చెన్నూరు, మార్చి 27: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని గురువారం ఉదయం చెన్నూరు కొత్త బస్టాండ్ నుంచి పెద్ద చెరువు వరకు తలపెట్టిన 5కే రన్ చేపడుతున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ రన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు

బెల్లంపల్లి: పట్టణంలోని తిలక్ స్టేడియం నుంచి స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 6 గంటలకు ఏఎంసీ గ్రౌండ్ వరకు 5కే రన్ నిర్వహించనున్నా మని తహసీల్దార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రన్‌లో అదనపు కలెక్టర్, ఆర్డీవో తదితరులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు, యువకులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంకట హర చతుర్థి నేడు

నస్పూర్, మార్చి 27: నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీలక్ష్మి గణపతి దేవాలయంలో గురువారం సంకట హర చతుర్థి సందర్భంగా స్వామి వారికి మహా హరిద్రా భిషేకం, హోమం, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రావు, ప్రధానార్చకులు వంశీకృష్ణ శర్మలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి ఆలయం ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. సాయంత్రం వేళలో స్వామి వారికి మహా హరిద్రాభిషేకం (పసుపు)తో అభిషేకం, రాత్రి వేళలో పుర వీధుల్లో పల్లకి సేవ, భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి, మార్చి 27: తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన, సంక్షేమగురుకుల పాఠశాలల్లో 2024-25 సంవత్సరానికి గాను 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కాసిపేట పాఠశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30 లోగా దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అలాగే తెలంగాణ సాంఘిక సంక్షేమగురుకులాల సంస్థ, ట్రైబల్ సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 6,7,8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని బెల్లంపల్లి గురుకుల ప్రిన్సిపాల్ సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ శిబిరం

తాండూర్, మార్చి 27 : తాండూర్‌లోని ఎంఆర్‌సీ పక్కన గల భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ 8 నుంచి 18 సంవత్సరాల దివ్యాంగులు కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీని కోసం పోషకులు చర్యలు తీసుకోవలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఇంక్లుసివ్ ఎడ్యుకేషన్ టీచర్స్ వెంకటేశ్వర్లు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

- ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు

కాసిపేట, మార్చి 27: ఆదివాసీ యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు అన్నారు. మద్దిమాడ పంచాయతీలోని చింతగూడెంలో బుధవారం నిర్వహించిన వాలీబాల్ పోటీలకు హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలు, చదువుపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆదివాసీ యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు చింతగూడెంయువజన సంఘం ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియా డారు. కాగా ఈ పోటీల్లో మండలం నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో గురువాపూర్ జట్టు విజేతగా నిలిచింది. సోనాపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ఆడె జంగు, గిరిజన సంఘం నాయకుడు మడావి అనంతరావు నగదుతో పాటు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మడావి గోపాల్, రమేశ్, జంగు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

అసంపూర్తి పనులు

- మూడేళ్లుగా పట్టింపు కరువు
- వినియోగంలోకి తీసుకురావాలని స్థానికుల వినతి


అసంపూర్తిగా ఉన్న భవనం

మందమర్రిటౌన్, మార్చి 27: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రూ. 5 కోట్లతో ప్రారంభించిన స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణం పూర్తవుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2021లో గత ప్రభుత్వం రూ. 5 కోట్లతో భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ పనులను ప్రారంభించారు. అనంతరం కాంట్రాక్టర్ పనులను కొంత వరకు చేపట్టాడు. బేస్‌మెంట్ వరకు పిల్లర్లు వేసి వదిలిపెట్టారు. మూడు సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తవలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం భవనం పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతికుటుంబానికి వంద రోజుల పని కల్పించాలి

● డీఆర్డీవో పీడీ సురేందర్


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో పీడీ సురేందర్

పెంచికలపేట, మార్చి 27: ఉపాధి హామీపథకం ద్వారా చేపడుతున్న పనుల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతికుటుంబానికి వందరోజుల పని కల్పించాలని డీఆర్డీవో పీడీ సురేందర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాల యంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వంద రోజుల పనికల్పనతోపాటు రూ.272 కూలి అందేలా పనులు చేయించాలని అధికారులకు సూచించారు. ఏప్రిల్1వతేదీ నుంచి కొత్త ఆర్థికసంవత్సరం ప్రారంభమవు తుందని ప్రతి గ్రామంలో పనులను గుర్తించి సిద్ధంగా ఉండాలన్నారు. కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసు కోవాలన్నారు. ప్రణాళిక ప్రకారం లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు సూచించారు. పనిప్రదేశంలో ముఖ్యంగా వేసవి కాలం ఎండ వేడిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆల్బర్ట్, ఏపీవో సతీష్, ఈసీ జైహింద్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

తిర్యాణిలో సీఆర్పీఎఫ్ బలగాల కవాతు


తిర్యాణిలో కవాతు నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ బలగాలు

తిర్యాణి, మార్చి 27: మండల కేంద్రంలో బుధవారం సీఆర్పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ చిట్టిబాబు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ ఎటువంటి భయం లేకుండా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ కమాండెంట్ రాకేష్‌కుమార్, ఎస్సై రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లంబాడీ హెట్టిలో కార్డన్ సెర్చ్


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ సాదిక్ పాషా

చింతలమానేపల్లి, మార్చి 27: మండ లంలోని లంబాడీ హెట్టి గ్రామంలో బుధవారం సీఐ సాదిక్ పాషా ఆధ్వ ర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సోదా చేయ గా ఆరుగురి వద్ద గుడుంబా దొరికింది. వారిపై కేసు నమో దు చేసి మరోసారి గుడుంబా అమ్మకుండా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. వేసవిలో దొంగతనాలు ఎక్కువ జరుగుతుంటాయని, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, మధుకర్, యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

సిర్పూర్(యు), మార్చి 27: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని మహగాం స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు డి అనిత, స్కూల్‌కాంప్లెక్స్ ఎస్‌ఆర్పీ శిర్మేల మారుతి అన్నారు. బుధవారం మండలంలోని మహగాం స్కూల్ కాంప్లెక్స్ భవనంలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకూండా బడికి హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథ కాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. పాఠశా లలకు సంబంధించిన రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

కెరమెరి, మార్చి 27: మండలంలోని మెట్టపిప్పిరి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికి పనికల్పించాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. అలాగే మండలకేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీవో అంజద్‌పాషా ఉన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రచారం

జైనూర్, మార్చి 27: ఆసిఫాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే బుధవారం మండలంలోని రాసిమెట్ట, దుబ్బగూడ, సుకుడ్‌పెల్లి తదితర గ్రామాల్లో నిర్వహించిన వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈసందర్భంగా నవదంపతులకు కానుకగా నూతనవస్త్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయాగ్రామాల్లో ఆదివాసులు ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఘనంగా సన్మానించారు. అనంతరం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కును గెలిపించాలని ఆదివాసులను కోరారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు ఇంతీయా జ్‌లాల, మాజీసర్పంచులు కోట్నాక మోతుబాయి, ఆత్రం గిరిజాబాయి, మడావి భీంరావ్, మేస్రాం పార్వతీబాయి ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా బుక్య రాజు

ఆసిఫాబాద్, మార్చి 27: బహుజన్‌ముక్తి పార్టీ (బీఎంపీ) ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ఆసిఫాబాద్‌కు చెందిన బుక్య రాజు పేరును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆపార్టీ కార్యాల యంలో జరిగిన అభ్యర్థుల ఎంపిక సమావేశంలో మొదటిజాబితా అభ్యర్థులను ప్రకటించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా రాజు పేరును ఖరారు చేశారు. సమావేశంలో బీఎంపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మయ్య, నరేందర్‌పవార్, కార్యదర్శి ఫయోముద్దీన్, మహమ్మద్ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 27: ఆంధ్ర ప్రదేశ్‌లోని కాకినాడలో ఈనెల 25న శివాలయం అర్చకుడు సాయి పూజలు నిర్వహిస్తుండగా ఆయనపై దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డీడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ శర్మ, జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆలయంలో భక్తుల సమక్షంలో కొందరు విచక్షణ రహితంగా దాడిచేయడం సిగ్గు చేటన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడు తామన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

బెజ్జూరు, మార్చి 27: మండలంలోని రంగపూర్ ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కుకుడ గ్రామానికి చెందిన నక్క గణేష్, ఈసుగాం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. రంగాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీటీ రోడ్డు పనుల కోసం వేసిన కంకరపై నుంచి బైక్ దాటుతున్న క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. దీనితో గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి వెంటనే చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించారు.

ఇప్ప పూల సీజన్

పెంచికలపేట, మార్చి 27: తరాల తరబడి గిరిపుత్రులు అడవులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వారికి అడవులే ఆయువుపట్టు, చెట్టు పుట్టలే కొండంత భరోసా, అలాంటి అడవి ఉత్పత్తుల్లో ఒకటి ఇప్పపువ్వు, వేసవి ఆరంభంలో ఇప్ప చెట్టుకు ఇప్ప పూలు పూస్తాయి, గిరి గ్రామాల్లో ప్రజలు వేకువజాముల్లోనే చెట్టు వద్దకు చేరుకుని ఇప్ప పూలను సేకరిస్తారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు ఇప్ప పూల సేకరణకు వెళ్తున్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

బెజ్జూరు, మార్చి 27: కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం నిర్వహించే బీఆర్‌ఎస్ పార్లమెంటరీ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సమావేశాన్ని విజయవంతం చేసేందుకు దిశా నిర్దేశం చేశారు. విస్తృతస్థాయి సమావేశానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారన్నారు. ఇందులో భాగంగా వివిధ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికల కార్యక్రమం కూడా ఉన్నందున అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలను తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంప్రసాద్, దేవాజీ, రాజేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సినేషన్

కెరమెరి, మార్చి 27:మండలంలోని లక్మాపూర్‌గ్రామంలో బుధవారం పశువైద్యాధికారి సోనియా పశువులకు గాలికుంటు వ్యాధినివారణ వ్యాక్సినేషన్‌చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పశువులకు వ్యాక్సినేషన్ చేయించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 27: మండలంలోని చిర్రకుంట ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 12నుంచి సాయంత్రం 6గంటల వరకు తుంపల్లి, చిర్రకుంట, కోసార, దాంపూర్, వీవీపీ కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

● క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తున్న విద్యార్థులు


భీమారంలో రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

జైపూర్, మార్చి 27: పంటల సాగులో మెలకువలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు రైతులతో మమేకమవుతున్నారు. మూడు నెలల క్రితం జిల్లాకు చేరుకున్న విద్యార్థులు కళాశాల నుంచి రైతుల చెంతకు చేరుకున్నారు. నాలుగు సంవత్సరాల వ్యవసాయ విద్యాభ్యాసంలో పంటల సాగు విధానంపై ప్రత్యక్ష అధ్యయనం కొనసాగిస్తున్నారు. జగిత్యాల జిల్లా జయశంకర్ విశ్వ విద్యాలయం విద్యార్థులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం ద్వారాగ్రామాల్లో పర్యటిస్తున్నారు. మంచిర్యాల జిల్లావ్యాప్తంగా 29మంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామాల వారీగా విడిపోయి రైతులతో కలిసి పంటల సాగును పర్యవేక్షిస్తున్నారు. బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త శివరామకృష్ణ సమన్వయకర్తగా వ్యవహరిస్తుండగా గ్రామ శివారుల్లో పంటలు సాగు చేస్తున్న తీరుపై రైతుల అనుభవాలు అడిగి తెలుసుకుంటున్నారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగుకు అను వైన వనరులు, భూసారం, నీటి లభ్యత, పంటల మార్పిడి, గ్రామీణ నైసర్గిక స్వరూపం, భౌగోళిక పరిస్థితులు పంటల సాగులో లాభ నష్టాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు తదితర అంశాలను విడమర్చి వివరిస్తున్నారు. కళాశాల విద్యార్థుల ద్వారా విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకుని గత అనుభవాలను జోడించి లాభసాటి వ్యవ సాయంవైపు అడుగులు వేస్తున్నామని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మే10వ తేదీవరకు గ్రామాల్లో ఉండి రైతులతో మమేకమై వ్యవ సాయసాగులో విషయపరిజ్ఞానాన్ని పొందను న్నామని వ్యవసాయ విద్యాలయం విద్యార్థులు చెబుతున్నారు.



మండుతున్న ఎండలు

- మార్చి చివరిలోనే జోరుగా ఎండలు
- జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- బుధవారం 42డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మధ్యాహ్నం.. రహదారుల నిర్మానుష్యం
- ఏప్రిల్, మే నెలల్లో తీవ్రం కానున్న ఎండ వేడిమి
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు

జిల్లాలో ఐదు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్ట	గరిష్ట
23న	22.1	38.0
24న	25.1	40.6
25న	24.1	40.9
26న	24.6	40.8
27న	25.0	42.0

ఆసిఫాబాద్, మార్చి 27: జిల్లాలో వారంరోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. మార్చి నెలలోనే భానుడు భగభగమంటున్నాడు. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనాలు అల్లాడిపోతున్నారు. ఎండ వేడిమికి మధ్యాహ్నం ఇండ్ల నుంచి బటకు వెళ్లేందుకు జంకుతున్నారు. బుధవారం జిల్లాలో 42.0డిగ్రీలు, కొన్నిచోట్ల 40డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గడిచిన ఐదు రోజుల్లో జిల్లాలో రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేడిమి పెరగడంతో ప్రజలు ఏసీలు, కూలర్లు కొనుగోలుకు మొగ్గుచూపు తున్నారు. శీతలపానీయాలకు గిరాకీ పెరిగింది. కాగా ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని ప్రజలు వడ దెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

సాయంత్రం నాలుగు దాటితే కానీ రహదారులపై జన సంచారం కనిపించడం లేదు. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. గత ఆరు రోజులుగా 40 నుంచి 42 డిగ్రీల వరకు చేరడం గమనార్హం. ఎండల తీవ్రతతో ప్రధానంగా దినసరి, ఉపాధి కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎండల కారణంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీల విషయంలో కుటుంబ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఇవీ జాగ్రత్తలు..

- ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు వ్యవసాయ పనులు చేయవద్దు. బయట తిరగడం, ఆటలు ఆడడం చేయకూడదు.
- తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోకి వెళ్తే తెల్లని రుమాలు ధరించాలి.
- తెలుపు రంగు ఉన్న పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలి.
- నీటితోపాటు ఇతర ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి.
- బయట నుంచి తిరిగి వచ్చిన వెంటనే నిమ్మరసం కానీ, కొబ్బరి నీళ్లుగానీ, చల్లని నీరు కానీ తాగాలి.
- తీపి పదార్థాలు, తేనె తీసుకోవద్దు.
- వేసవిలో నలుపు రంగు, మందంగా ఉండే దుస్తులు ఎట్టి పరిస్థితుల్లో ధరించవద్దు.
- చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడే వారు జాగ్రత్తగా ఉండాలి.
- వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

భానుడి భగ భగ..

ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గత వారం రోజులుగా పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఎక్కువగా కనిపిస్తోంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎండ చురుకుమంటోంది. 11 గంటలు దాటితే ఇంట్లో నుంచి బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. అప్పటి నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇంట్లో ఉన్నా తీవ్ర ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉంటే వచ్చే రెండు నెలల్లో పరిస్థితి ఎలా ఉండబోతుందోనని జనం ఆందోళన చెందుతున్నారు.

వేసవిలో ఎదురయ్యే సమస్యలు..

ఎండలో ఎక్కువగా తిరిగినా, పని చేసినా శరీరానికి తగినంత నీరందక ఖనిజాలు, లవణాలు లోపించి నిస్సత్తువ ఆవరిస్తుంది. దీంతో తీవ్రమైన అలసట కలుగుతుంది. ఒక్కోసారి కండరాలు కూడ పట్టేస్తుంటాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా స్పృహ తప్పుతారు. ఎండలో తిరగడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి, సొమ్మసిల్లి పడిపోయే ప్రమాదముంది. వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత లోపించడంతో అతిసార సోకే ప్రమాదముంది. విరేచనాలు, వాంతులు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.


ఆసిఫాబాద్‌లో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

40నుంచి 42 డిగ్రీలకు చేరిన పగటి ఉష్ణోగ్రత..

జిల్లాలో పగటి ఉష్ణోగ్రత వారంరోజులుగా 40నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్ర త నమోదు కావడంతో నిప్పుల కొలిమిగా మారింది. గతేడాది మార్చి నెలాఖరు వరకు సాధారణ పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు కాగా ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. వారం రోజుల నుంచి పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉద యం తొమ్మిది గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య ఉష్ణోగ్రతలు 37 నుంచి 38 డిగ్రీల సెల్సియస్ నమోదవుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటల వరకు ఉష్ణోగ్రత తీవ్రత మరింత పెరుగుతుండడంతో వీధులు, ప్రధాన రహదారిపై జన సంచారం ఉండడం లేదు.

జాగ్రత్తలు పాటించాలి..

డాక్టర్ సత్యనారాయణ, ఆసిఫాబాద్



వేసవిలో వడ దెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలి. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండడంతో అవసరమైతే తప్ప బయట తిరగొద్దు. శరీరక శ్రమతో కూడిన పనులు చేయవద్దు. డీహైడ్రేషన్‌కు గురవకుండా మంచినీటిని అధికంగా తీసుకోవాలి. కాటన్ దుస్తులనే ధరించాలి. ఎండలో ప్రయాణించాల్సి వస్తే ముఖానికి రుమాలు కట్టుకోవాలి, టోపీలు, చలువ అద్దాలు, గొడుగు, హెల్మెట్ ధరించాలి. మజ్జిగ, నిమ్మరసం, ఉప్పుకలిపిన నీటిని తరుచూ తాగాలి. ఆరోగ్యసమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలి.

మున్సిపాలిటీ అభివృద్ధికి పటిష్ఠ చర్యలు

- వరంగల్ రీజనల్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాహిద్ మసూద్


మాట్లాడుతున్న షాహిద్ మసూద్

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 27: నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సి పాలిటీ అభివృద్ధికి అధికారులు, ప్రజల సమన్వయంతో పటిష్ఠచర్యలు తీసుకోనున్నట్లు వరంగల్ రీజనల్‌ఆఫ్‌మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాహీద్ మసూద్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావుతో కలిసి కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో అవకతవకలు తనదృష్టికి వస్తే తప్పకుండా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. నూతన మున్సిపల్ కార్యాలయం ఏర్పాటుపై జిల్లా ఉన్నతాధికారులకు వివరించామన్నారు. స్థానికప్రజల సహకారంతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఆయనవెంట డీఈ మసూద్‌అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థి


నాగేశ్వరి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 27: ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న కె నాగేశ్వరి గురువారం నుంచి ఏప్రిల్2 వరకు ఢిల్లీలో జరుగనున్న జాతీయస్థాయి ఖోఖోపోటీలకు ఎంపికైనట్లు క్రీడాధికారి బండ మీనారెడ్డి, హెచ్‌ఎం కృష్ణరావు తెలిపారు. గత ఫిబ్రవరిలో యాదాద్రి భువన గిరిలో జరిగిన 56వ రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియ న్‌షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఈనెల16నుంచి 25వరకు రంగారెడ్డి జిల్లా పరిగిలో జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొని తెలంగాణ జట్టు తరపున జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా, డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్దవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, ఉపాధ్యాయులు విద్యార్థి ఎంపిక పట్ల అభినందనలు తెలిపారు.

తనిఖీల్లో నగదు పట్టివేత


వాంకిడిలో పట్టుకున్న నగదుతో పోలీసులు

వాంకిడి, మార్చి 27: మండలంలోని పోలీస్‌స్టేషన్‌వద్ద బుధవారం వాహనాల తనిఖీల్లో భాగంగా సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.30లక్షల పట్టుకున్నట్లు ఎస్సైసాగర్ తెలిపారు. మహారాష్ట్రకుచెందిన రాంబారే చంద్రషుడ్ తనకారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా రూ.1.30లక్షలు పట్టుకున్నట్లు వివరించారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై పోశెట్టి, ఉల్లాస్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావుపేటవద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద లక్షరూపాయలు పట్టుకున్నట్లు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. మహబూబాబాద్‌కు చెందిన రాందాస్ కారులో లక్షరూపాయలతో మహారాష్ట్రకు వెళ్తుండగా వాహనాలతనిఖీల్లో భాగంగా పట్టుకున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి కింద కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పట్నాపూర్ ఆశ్రమపాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

జైనూర్, మార్చి 27: మండలంలోని పట్నాపూర్ ఆశ్రమపాఠశాల హెచ్‌ఎం జాదవ్ పర్శరాంను సస్పెన్షన్ చేసినట్లు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి బుధవారం తెలిపారు. పాఠశాల నుంచి బియ్యం అక్రమ రవాణా వ్యవహారంపై పూర్తి విచారణ జరిపి నివేదికను ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తకు సమర్పించగా ఆమె సస్పెండ్ చేశారన్నారు. ఈ మేరకు హెచ్‌ఎం పర్శరాంకు సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు.

ఇష్టారాజ్యంగా పనులు చేపడితే ఊర్కునేది లేదు


పనులను పరిశీలిస్తున్న జడ్పీటీసీ అజయ్‌కుమార్

వాంకిడి, మార్చి 27: మండలంలోని జాతీయ రహదారి నుంచి కనర్‌గాం మీదుగా కాగజ్‌నగర్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మిస్తే ఊర్కొనేది లేదని జడ్పీటీసీ అజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం రోడ్డు, వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మాణపనులు చేపడు తున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ ఈఈకి ఫిర్యాదు చేశారు. పనుల్లో నాణ్యత లోపించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేపడుతామన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, మార్చి 27: జిల్లాషెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1,2,3,4, ఎస్ఎస్‌సీ, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్సై, కానిస్టేబుల్ తదితర రాష్ట్ర, కేంద్రస్థాయి ఉద్యోగాల కోసం మూడు నెలల పాటు ఉచితశిక్షణ ఇస్తామని జిల్లాషెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖాధికారి సజీవన్ ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల28 వరకు కాగజ్‌నగర్ పట్టణంలోని సాయితేజ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ ద్వారా ఎంపికతో పాటు అభ్యర్థులకు డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. ఇతర వివరాలకు వసతిగృహ సంక్షేమాధికారులు దేవాజీ (9985274060), డి చందన (8247299217)ను సంప్రదించాలన్నారు.

విద్యుత్ లైన్ల కింద మంటలు పెట్టవద్దు

ఆసిఫాబాద్, మార్చి 27: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలోని 400 కేవీ విద్యుత్ లైన్ల కింద పంట మిగులును తగులబెట్టవద్దని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఇంజనీర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద పంటలు పండిచే రైతులు చేనులో మిగిలిన చెత్తను కాల్చి వేసే క్రమంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. సమీపంలోని జంతువులు, మనుషులకు హాని జరిగే అవకాశం ఉంటుందన్నారు. రైతులు గమనించి ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్‌లైన్ల కింద మంటలు పెట్ట వద్దన్నారు.

సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 27: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా అధికారులు, వైద్యులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారి తుకారాం భట్‌తో కలిసి జిల్లా వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలియోరహిత జిల్లాగా మార్చడంలో భాగంగా జిల్లాలో చేపట్టిన పోలియో కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి వందశాతం పూర్తిచేయడం అభినందనీయమన్నారు. ఇదేస్ఫూర్తితో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలతో మమేకమై స్నేహపూర్వక వాతావరణంలో వైద్యం అందించాలని, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తల సమన్వయంతో వైద్యాధికారులు గర్భిణులకు అందించే పౌష్టిక ఆహారంతో పాటు మహిళలకు ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇచ్చేలా వివరించాలని తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపతుల పనితీరు, లక్ష్యాలపై అధికారులతో సమీక్షించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లాలోని దహెగాం మండలం గిన్నెధరి, కౌటాల మండలకేంద్రంలోని ప్రాథ మిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రతిమంగళవారం మహిళ లకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశామని తెలిపారు. వేసవి కాలం అయినందున గ్రామాల పరిధిలోని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మార్చి నుంచి జూన్‌వరకు వేసవిలో తాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా ట్యాంకర్లు, బోరువెల్స్, మిషన్ భగీరథ సంబంధిత పైపులైన్ల మరమ్మతులు చేపట్టితాగునీటి కొరతలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పిల్లల్లో పోషణ లోపాన్ని పూర్తిగా అరికట్టాలి..

పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వారి బంగారు భవిష్యత్‌కు పునాది వేసేది మంచి ఆహారం, విద్య మాత్రమేనని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేష్ దోత్రే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ పిల్లల్లో0-6 సంవత్సరాల వయస్సు చాలా ముఖ్యమైనదన్నారు. ఆ సమయంలో వారిలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. బాల్యం నుంచే ఆత్మ విశ్వాసం పెరిగేలా ప్రోత్సహించాలన్నారు. పిల్లల ప్రగతికి బాటలు వేయాలంటే వారికి ముఖ్యంగా అందించాల్సినది పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన అల వాట్లు, విద్య మాత్రమేనని తెలిపారు. పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని వందశాతం అరికట్టాల న్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో భాస్కర్, సీడీపీవోలు సాదియా, సురేఖ పాల్గొన్నారు.


ఆహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ప్రారంభం కానున్న ఫ్లైఓవర్ పనులు

సిర్పూర్(టి), మార్చి 27: మండలంలోని వేంపల్లి సమీపంలోని రైల్వేగేటు వద్ద నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులు ప్రారంభం కానున్నాయి. ట్రాక్‌పై పై ఓవర్ ప్లేట్లు అమర్చేందుకు ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అధికారులు భారీ యంత్రాలను సిద్ధంగా ఉంచారు. నేడోరేపో పనులు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.

31 వరకు గడువు పొడిగింపు

సిర్పూర్(టి), మార్చి 27: సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ, గిరిజన సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్లాగ్ సీట్ల భర్తీకి గడువుతేదీని ఈనెల31 వరకు పొడగించినట్లు డీసీవో బాలరాజు ఒకప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకోవాలన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న మహిళపై కేసు

జైనూర్, మార్చి 27: మండలంలోని శివనూర్ గ్రామానికి చెందిన చావలిబాయి ఇంట్లో గుడుంబా విక్రయిస్తోందన్న ముందస్తు సమా చారం మేరకు తనిఖీచేయగా 20లీటర్ల గుడుంబా లభించిందని ఎస్‌ఐ సందీప్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సదరు మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

వాంకిడి, మార్చి 27: మండలకేంద్ర శివారుప్రాంతంలో బుధవారం పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడిచేసి పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.6,800నగదు స్వాధీనం చేసుకొని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

లింగాపూర్, మార్చి 27: మండలంలోని మామిడిపల్లి గ్రామపంచాయతీ పరిధి లోగల నడ్డంగూడా గ్రామానికి చెందిన జాదవ్‌విలాస్ అధికధరలకు మద్యం విక్రయిస్తుండడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీకి వెళ్లిన ఎస్సైతోపాటు సిబ్బందిని జాదవ్‌విలాస్ ఇష్టం వచ్చినట్లు భూతులు తిడుతూ దుర్భాషలా డాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.



కనీస పింఛన్ రూ.15వేలు ఇవ్వాలి

శ్రీరాంపూర్, మార్చి 27: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కనీసపింఛన్ రూ.15వేలు ఇవ్వాలని సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్‌ను బుధవారం హైదరాబాద్‌లో సన్మానించి పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కోల్ పెన్షన్-1998 చట్టాన్ని సవరించి కనీస పింఛన్‌ను రూ.15 వేలుగా నిర్ణయించాలన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి కరువు భత్యంతో కూడిన పింఛన్ ఇవ్వాలన్నారు. ఆయా సమస్యలను ముఖ్యమంత్రి, సింగరేణి సీఎండీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని జనక్‌ప్రసాద్ పెన్షనర్స్‌కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె వాసుదేవ్‌రావు, ఎ బుచ్చిప్రసాద్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్‌సీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత గనులుగా తీర్చిదిద్దాలి

కాసిపేట, మార్చి 27: సింగరేణిలో ప్రమాదరహిత గనులుగా తీర్చిదిద్దడంలో కార్మికులు అధికారులు భాగస్వాములు కావాలని మందమర్రి ఏరియా రక్షణాధికారి రవీందర్ అన్నారు. బుధవారం మందమర్రి డివిజన్ పరిధిలోని కాసిపేట2వ గనిపైనిర్వహించిన రక్షణ సూత్రాల అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సింగరేణిలో ప్రమాదాల నివార ణకు ప్రతిఒక్కరు బాధ్యతగా రక్షణ సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో కేకే గ్రూపుఏజెంటు రాందాస్, గనిమేనేజర్ లక్ష్మీనారాయణ, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి


ఇందారం ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్/జైపూర్, మార్చి 27: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) జి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే7గని, శ్రీరాంపూర్, జైపూర్‌లోని ఓసీపీలను జనరల్‌మేనేజర్ బి సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు నాలుగు రోజుల గడువే ఉందని, ఉద్యోగులు నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిని సాధించాలని ఆదేశించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ వెలికితీతపై ప్రైవేటుకాంట్రాక్టు కంపెనీలతో మాటాడారు. ఆర్కే7గనిలోనికి దిగి పనిప్రదేశాలలో ఉద్యోగులతో మాట్లాడారు. తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించాలని, రక్షణ సూత్రాలు పాటించాలని సూచించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పనులు కొనసాగించాలన్నారు. కార్యక్రమాలలో ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమరెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఓసీపీ పీవో టి శ్రీనివాస్, మేనేజర్ బ్రహ్మాజీరావు, ఆర్కే 7 గ్రూపు ఇన్‌చార్జి ఏజెం ట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ శ్రీధర్, క్వాలిటీమేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, సర్వే అధికారి సంపత్, ఎస్‌ఎస్‌వో మురళీమోహన్, తదితరులు, జైపూర్‌లో జరిగిన కార్యక్రమంలో గని ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, గ్రూప్‌మేనేజర్ వెంకటేశ్వర్లు, గని మేనేజర్‌రవికుమార్, ఇంజనీర్ రమేష్, ఏరియా సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీరాంపూర్, మార్చి 27: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉంటేనే కార్మికులసమస్యలు పరిష్కారమవుతాయని ఆపార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసశ్రీనివాస్ అన్నారు. బీజేపీజిల్లా అధ్యక్షుడు వి రఘునాథ్‌తో కలిసి ఆయన బుధవారం ఉదయం మొదటిషిఫ్ట్‌లో కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. పెద్దపల్లి పార్లమెంట్‌స్థానం నుంచి పోటీచేస్తున్న తనను భారీమెజార్టీతో గెలిపించాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు సత్రం రమేష్, ఇన్‌చార్జి కమలాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలవనున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 27: సింగరేణివ్యాప్తంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి గురువారం రాష్ట్రమంత్రులను కలువనున్నట్లు ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు తెలిపారు. బుధవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలోని 11ఏరియాలకు చెందిన యూనియన్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లనున్నట్లు చెప్పారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్నుమినహాయించాలని, డిపెండెంట్ల వయస్సును 35ఏళ్లనుంచి 40 ఏళ్లకు పెంచాలని, తదితర సమస్యలను మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొంగులేటిని కలిసి విన్నవిస్తామన్నామన్నారు. అన్ని ఏరియాలకు చెందిన నాయకులకు యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు. నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గరిగె స్వామి, సీహెచ్ భీంరావు, కలవేన శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.